


*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# గెలుపే!!

పొద్దున్నే పాలు తీసుకోవడానికి తలుపు తీసిన వనిత గుమ్మం చుట్టూనూ, తలుపు మీదా కట్టి ఉన్న రంగు రంగుల బుడగలు చూసి ఆశ్చర్యపోయింది. తలుపు మీద ' వైదేహీ, పుట్టిన రోజు శుభాకాంక్షలు!! ' అని రాసి ఉన్న చిన్న స్టిక్కర్.

“అరే! అమ్మ పుట్టినరోజు కదా ఈ రోజు?? కానీ ఆ విషయం ఎవరికి తెలుసు ఇక్కడ? ఎవరు చేసుంటారీపని?" అనుకుంటూ అపార్ట్మెంట్ కారిడార్ చివరికంటా దృష్టి సారించింది.

దూరంగా వయసు తెచ్చిన అలుపుతో నెమ్మదిగా అడుగులు వేస్తున్న పెద్దావిడ తప్ప మరెవరూ కనిపించలేదు.

పిల్లలు స్కూళ్ళకీ, భర్త ఆఫీసుకీ వెళ్ళాకా కూర్చుని తల్లితో కబుర్లు చెప్తూ ఈ ప్రస్తావన తెచ్చింది.

“మా అపార్ట్మెంట్ లో ఒకరికొకరు ఈ రకంగా విషెస్ చెప్పడం మామూలే నమ్మా, కానీ కేవలం రెండు నెలల క్రితం వచ్చిన నీ పుట్టినరోజు గురించి ఎవరికి తెలుసు? పైగా చేత్తో తయారుచేసిన ఈ గ్రీటింగ్ కార్డ్ ఎంత బావుందో చూడు. పుట్టిన రోజు శుభాకాంక్షలు ప్రియమైన వైదేహీ! అని నీ పేరుతో సహా రాశారు. అదే నాకు ఆశ్చర్యంగా ఉంది, నా స్నేహితులకి నువ్వొస్తున్న సంగతి తెలుసు కానీ, నీ పేరు కూడా తెలీదు, అలాంటిది నీ పుట్టినరోజు విషయం అసలు తెలిసే అవకాశమే లేదు..”

" ఒకవేళ పిల్లలేమైనా చేశారేమో?" అంది పెద్దావిడ.

" సరేలే! వాళ్ళకి వాళ్ళవి తప్ప మరెవరివీ గుర్తే ఉండవు, వాళ్ళు చేశారంటే నాకు నమ్మకం లేదు" అంది.

పదకొండున్నరకి పని అమ్మాయి రాధ వస్తూ ' అమ్మా తలుపుకి పెట్టి ఉంది" అంటూ ఒక కవర్ తెచ్చి ఇచ్చింది. రెండు తెల్లటి ప్లాస్టిక్ బాక్స్ లు. ఒక దాంట్లో మంచి ఇంగువ పోపుతో ఘుమ ఘుమలాడుతున్న దబ్బకాయ పులిహోర, మరొ దానిలో చిక్కటి పాలతో తయారుచేసిన బాసుంది.

మళ్ళీ అదే చేతి రాతతో చిన్న చీటీ. " నాకు గుర్తున్న నీకిష్టమైన వంటకాలు నేస్తం! ఈ ఇష్టాలు మారవు, నువ్వూ మారవు, నాకు తెలుసు"

అవి చూసిన వనిత తల్లి " ఇందు".. ఇది ఇందు పని. ఇందు ఇక్కడుందా? నీకు తెలుసా వనితా ఇందు ఎక్కడుందో?' అని ఆత్రంగా, ఉద్వేగంగా అడిగింది.

"ఇందెవరమ్మా? ఆపేరుగల వాళ్ళెవరూ నాకు తెలీదే " అంది వనిత, అలా అంటూనే గుర్తుతెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ.

" ఇది ఖచ్చితంగా ఇందు పని.. పొద్దున్నించీ గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నిస్తున్న ఈ చేతి రాత ఇందుదే" అంది ఆవిడ వీధి తలుపు వైపు పరుగుతో నడుస్తూ..

తలుపు తీసి అటూ, ఇటూ చూస్తున్న తల్లి వెనకే నడిచింది వనిత.. బాగా పొడుగ్గా ఉన్న కారిడార్ లో అదే భారపు నడకతో నెమ్మదిగా నడుస్తున్న ఆ పెద్దావిడ మసగ్గా కనిపించింది. ఆ దిశగా వడివడిగా వెళుతున్న తల్లిని అమ్మా, ఎక్కడికి?" అంటూ అనుసరించింది వనిత.

'ఇందూ', ‘ఇందూ'.. పిలుస్తూ ఆ పెద్దావిడ వెనకే పరుగులాంటి నడకతో వెళ్ళింది వనిత తల్లి వైదేహి.

ముందు వెళుతున్న ఆవిడకి ఆ పిలుపు వినిపించిందో లేదో తెలియదు కానీ ఆవిడ ఇంకాస్త వడిగా నడుస్తున్నట్టనిపించింది వనిత కి.

" అమ్మా, ఎవరమ్మా?" అడిగింది తల్లిని..

" ఇందు , ఇందీవర, నా స్నేహితురాలు.. నా చిన్ననాటి స్నేహితురాలు" అంది ఆవిడ ముందు నడుస్తున్న ఆవిడని చూపిస్తూ..

"అలాగా? వాళ్ళీ మధ్యనే వచ్చారు. నేను రెండు మూడు సార్లు చూశాను, అంతే. ఉండు నేను గబ గబా వెళ్ళి పిలుచుకొస్తాను" అంటూ పరుగున వెళ్ళి ఆవిడని ఆపింది..

" ఆంటీ, నమస్తే! నా పేరు వనిత. మీ ఫ్రెండ్ వైదేహి గారి కూతుర్ని. అమ్మకి శుభాకంక్షలు చెప్పి, ఇష్ట మైన పదార్థాలు ఇచ్చి ఇలా ఇంట్లోకి రాకుండా వెళ్ళిపోతారేమిటి? రండి మా ఇంటికి వెళదాం, మీ చేతి రాత ని గుర్తు పట్టి, మీ వెనకే వస్తోంది అమ్మ చూడండి" అంది ఆవిడ పక్కగా వెళుతూ..

ఆవిడ వంచిన తల ఎత్తి ఒకసారి వనితని చూసి, ఆపైన మళ్ళీ నడవడానికి సిద్ధం అవుతూ...

వద్దమ్మా,మళ్ళీ వస్తాను' అందావిడ నెమ్మదిగా. ఎర్రబడిన ఆవిడ ముఖం, పైకి కనిపించక పోయినా అవిడ గొంతులో అస్పష్టంగా వినిపిస్తున్న బాధ చూసి వనిత కి ఆశ్చర్యం కలిగింది.

" లేదు, ఈ రోజు తప్పక మీరు రావాలి, అమ్మ పుట్టినరోజు కూడా. అసలు మీరు అమ్మకి ఎప్పుడు, ఎక్కడ ఫ్రెండ్ అనే విషయం కూడా నాకు తెలీదు, అమ్మ ఎప్పుడూ చెప్పలేదు. కాని ఇక్కడ ఇలా కలవడం చాలా ఆనందంగా ఉంది. అందుకని మొదటి పరిచయం లోనే ఇలా అధికారపూర్వకంగా మాట్లాడుతున్నానని, మరోలా అనుకోకుండా ఈ రోజు మా ఇంటికి రావాల్సిందే. ఇది నా రిక్వెస్ట్ మాత్రమే. అమ్మనిలా చూసి ఎన్ని రోజులయ్యిందో? దట్ టెల్స్ మీ దట్ యూ ఆర్ స్పెషల్!" అంది గబ గబా..

అప్పటికి నెమ్మదిగా నడుచుకుంటూ వైదేహి కూడా అక్కడ చేరుకుని..

"ఇందూ!, ఇన్నేళ్ళకి కలిసి ముఖం చాటేస్తావా? ఇంట్లోకి రావూ?" అంది ఇందీవర చేతిమీద చెయ్యి వేస్తూ..

" వద్దు, వైదూ! రాలేను.. అసలు జీవితంలో మళ్ళీ చూడగలనా? అనుకున్న నిన్ను ఇన్నేళ్ళకి మళ్ళీ చూడగలిగలిగాను. అది చాలు.. ఇప్పటికైనా నువ్వు క్షమిస్తే! " ఆపైన మాటలు రాలేదు ఆవిడ చెయ్యి పట్టుకుంటూ.

"అవేం మాటలిందూ, అవన్నీ ఇప్పుడెందుకు? మాటలెందుకు? "అందావిడ.

" అది నీ పెద్ద మనసు, అంతే! నా తప్పు లాగే!" అంది ఆవిడ. ఆమాట పూర్తవ్వకుండానే ఆవిడ చెయ్యి పట్టుకుని ఇంట్లోకి లాక్కుని వెళ్ళసాగింది. తప్పందన్నట్టు కదిలిందావిడ.

" మీరిద్దరూ ఇక్కడ కూర్చోండి. నేను టీ చేసి తీసుకొస్తాను" అంటూ వంటింట్లోకి నడిచింది వనిత. అప్పటికి ఒంటరిగా మిగిలిన స్నేహితురాళ్ళిద్దరి మధ్యా మౌనం..

"వైదూ, నువ్వూ, ఆనంద్ నన్ను" అంటూ ఎదో చెప్తున్న ఆమె మాటలు విననట్టు వైదేహి " నువ్వెలా ఉన్నావో ముందు చెప్పు! ఇక్కడకి ఈ మధ్యనే వచ్చారుట కదా! మీవారెలా ఉన్నారు? పిల్లలేం చేస్తున్నారు? ఎంతమంది?" లాంటి ప్రశ్నలు వేసింది..

ఇందీవర మాత్రం ఏమీ మాట్లాకుండా తన చేతిని పట్టుకున్న స్నేహితురాలి చేతి గాజులు సవరిస్తూ మౌనంగా ఉంది..

"ఆనంద్!" అంది ఇందీవర స్నేహితురాలి వైపు చూస్తు..

"అవును, రెండేళ్ళయింది" అంది వైదేహి భారంగా.

"ఎవరో ఒకరు ముందు వెళ్ళవలసినదే కదా, మా ఇద్దరిలో ఆనంద్ ముందు.. అంతే " అంది వైదేహి.

వాళ్ళేం మాట్లాడుతున్నారో అర్థం కావడంలేదు అప్పుడే టీ తీసుకొనివచ్చిన వనితకి..

టీ తాగు ఇందూ, అంది వైదేహి స్నేహితురాలికొక కప్పు ఇస్తూ..

" వద్దు, వైదు.. నేను వెళతాను ఇంక.." అంది..

" అప్పుడేనా? ఈ పూట మాతోనే భోజనం చెయ్యాలి మీరు, నేను వెళ్ళి అంకుల్ ని పిలుచుకుని వస్తాను" అంది వనిత..

" లేరమ్మా, వాళ్ళ చెల్లెలికి సుస్తీగా ఉంటే చూస్తి రావడానికి వెళ్ళారు, ఎల్లుండి వస్తారు" అందావిడ.

" మరింకేం? ఇక్కడే ఉండండి ఈ పూట" అంది వనిత..

" పాపది అంతా ఆనంద్ పోలికే, అందుకే త్వరగా గుర్తు పట్టాను, నీ రాకతో అంతా మంచులా విడిపోయింది " అంది ఆవిడ వనిత చెంపలు తడుముతూ..

అవును అంది వైదేహి.

ఏంతో ఆత్మీయత నిండిన బంధాన్ని మరేదో విషయం బయటపడనీకుండా చేస్తోందని అనిపించింది వనితకి. ఇద్దరూ చిన్ననాటి స్నేహితులంటున్నారు, ఇన్నాళ్ళు కలుసుకోలేదు సరే అమ్మ కూడా ఎప్పుడూ చెప్పలేదు. అనుకుంది వనిత..

తల్లీ కూతుళ్ళ బలవంతమ్మీద భోజనం చేసి మధ్యాహ్నం వెళ్ళిందావిడ తన ఫ్లాట్ కి. ఆ తర్వాత అడిగింది తల్లిని

"ఎవరమ్మా ఆవిడ?" అని..

" నా చిన్ననాటి స్నేహితురాలు వనితా. ఒకప్పుడునా ప్రాణస్నేహితురాలు చెప్పాలంటే " అంది వైదేహి.. ఆపైన నిద్ర వస్తోందని వెళ్ళి పడుకుంది. అమ్మ తీరు చిత్రంగా అనిపించింది వనితకి..

మరో పదినిమిషాలకి తన మొబైల్ కి మెసేజ్.. "ఒక్కసారి మా ఇంటికి రాగలవా తల్లీ!" అని.

అమ్మ పడుకుంది కదా అని తలుపు దగ్గరకి వేసి ఇందీవర ఫ్లాట్ కి వెళ్ళింది వనిత.. తలుపు తీసి ఉంచి ఎదురుచూస్తోంది ఆవిడ. ఎర్రబడ్డ ముఖం, ఏడ్చి అలసినట్టున్న కళ్ళు..

"చెప్పండాంటీ" అంది వనిత..

మీ అమ్మ నీకేమీ చెప్పదు నాకు తెలుసు, అందుకే నేనే చెప్తాను అంది.. ఆపైన ఆవిడని ఆపడం ఆవిడ తరమే కాలేదు..వాళ్ళు చూడనిది తలుపవతల నిల్చున్న వైదేహిని..

"పదిహేడు, పద్దెనిమిదేళ్ళ తెలిసీ తెలియని వయసు.

వైదేహిదీ, నాదీ ఎన్నాళ్ళ స్నేహమో చెప్పలేను. నాకు ఊహ తెలిసినప్పటినించీ నాకున్న స్నేహితురాలు అదే.. వాళ్ళ నాన్నగారు ఊర్లో పెద్ద డాక్టర్, బాగా కలిగిన కుటుంబం. ముగ్గురన్నతమ్ముల తర్వాత అపురూపంగా పుట్టింది వైదేహి. ఎనిమిదిమంది పిల్లలున్న పేద కుటుంబం మాది. నేను ఆరోదాన్ని. అక్కలకి పెళ్ళిళ్ళు చేసి, అన్నలిద్దరికి మాకున్న కాస్త పొలము ఇచ్చేసరికి మిగిలిన మా ముగ్గిరికీ ఏం మిగిలిందో దేవుడికెరుక. నాన్న చేసే పక్క ఊరి టీచర్ గిరీ, అమ్మ చేసే వేణ్ణీళ్ళకి చన్నీళ్ళ సాయాల మధ్య ఎలాగో పెరిగి పెద్దయ్యాం.

నాకున్నఆస్తల్లా కన్ను చెదిరే అందం, మీ అమ్మ స్నేహం, ఎలాగో అబ్బిన కమ్మని కంఠం. మీ అమ్మ ఒక్కతే కావడాన అత్తయ్యగారు అదే మీ అమ్మమ్మ, నన్ను ఎప్పుడూ వైదేహికి తోడుగా ఉండమనేవారు. అలా నేను మా ఇంట్లో తక్కువ, మీ అమ్మమ్మగారింట్లో ఎక్కువా పెరిగాననే చెప్పాలి. చదువులో చురుగ్గా ఉండేదాన్ని కనక దానికి రానివన్నీ చెప్పేదాన్ని.

తమ ఇంట్లో పిల్లలా నన్నెంతో బాగా చూసేవారు వాళ్ళింట్లోపండగలకి దానితో సమానంగా బట్టలు కొనేవారు. నా పుట్టినరోజు ఎంతో బాగా చేసేవారు. అలా ఎంతో ఆనందంగా ఉండే మాఇద్దరి బంధం అందరికీ ఈర్ష్య కలిగించేలా ఎదిగేక్రమంలో ఎక్కడో, ఏమూలో నాకు తెలీకుండా నాలోనూ వైదేహి అంటే ఎక్కడో తెలీని చిన్న అసూయ మొదలయింది.

ఎందుకో తెలీని వయసు, ఏమిటో కూడ అర్థం కానంత చిన్న మనసు. దానికున్న నగలూ, బట్టలూ, ఇంట్లో జరిగే అపురూపాలు చూసేమో బహుశా.. అప్పటి నా మనసేమిటో నాకే తెలీదు.

' ఎంత డబ్బుంటేనేం? నీకున్న చక్కదనం దానికేది? నీలా చదువుతుందా?' లాంటి అమ్మ ఊరట మాటలు నాలో తెలీని అహాన్ని నిద్రలేపేవి.

' మా వైదేహికి కాస్త నీలా మంచి మార్కులు వచ్చేలా చూడమ్మా', అంటే ఆనందంతో పొంగిపోయేదాన్ని. అయినా సరే, నాకెన్ని ప్రత్యేకతలున్న దానికున్న సంపద ముందు తక్కువే అనిపించేది. అన్ని విషయాల్లోనూ ఎప్పుడూ దానిదే గెలుపు అనిపించేది.

మీ అమ్మకి మాత్రం మొదటినించీ ఏమీ తెలీదు. ఎప్పుడూ ఒకేలా ఉండేది.మనసులో ఏమున్నా తన స్నేహాన్ని మాత్రం ఒదులుకోవడం అనే ఆలోచనే నాకు వచ్చేది కాదు. దానికి చాలా కారణాలు. వాళ్ళు చూపే మంచితనానికి, నాలో రేగుతున్న స్పర్ధకీ మధ్య సతమతమయ్యేదాన్ని. ఆ పరిస్థితుల్లో మా మధ్యకి వచ్చాడు ఆనంద్.

" ఈ రోజు వాళ్ళింటికి వెళ్ళకే, వైదేహికి పెళ్ళిచూపులుట" అంది అమ్మ.

" దానికి పెళ్ళి చూపులైతే నేను వెళ్ళడానికేం? అయినా వాటిగురించి నాకు తెలియకపోతేగా, రేపు మన వైదు ని చూసుకోవడానికి పెళ్ళివారొస్తున్నారు. నువ్వు త్వరగా వచ్చెయ్యి, దాని ముస్తాబు అదీ నాకు తెలుస్తుందా? అని అత్తయ్యగారే చెప్పారు" అన్నాను నేను

" పిచ్చి మొద్దు, వాళ్ళకివే మీ పట్టవు కంక నీకేమీ చెప్పలేదు అత్తయ్యగారు. వయసులో ఉన్న పెళ్ళి కాని చెల్లెళ్ళనీ, స్నేహితురాళ్ళనీ రానివ్వరు, అందులోనూ పిల్లకన్నా అందంగా ఉన్నవాళ్ళనిఎప్పుడేమవుతుందో చెప్పలేం" అంది అమ్మ.

ఆ మాటలకి నాకు సరదా వేసింది. ఏమవ్వాలో చూడాలని మరీ అనిపించింది. ఎన్నో సినిమాల్లో చూశాను, నవలల్లో చదివాను ఇలాంటివి, ఈరోజు నిజంగా అవుతుందా? ఏమో? ఇదే ఆలోచనతో నిర్లక్ష్యంగా తలెగరేసి ఎప్పటిలాగే వెళ్ళాను.

నన్ను చూసి అత్తయ్యగారు "రామ్మా!" అంటూ వైదేహి ముస్తాబంతా నా చేతిలో పెట్టేసి మిగతా పని చూసుకోవడానికి వెళ్ళిపోయారు.

నాకు మొదటి చూపులోనే ఎంతగానో నచ్చాడతను. పట్నంలో డాక్టర్, ఒక్కడే కొడుకు. అంతకంటే కావలసినదేముంది? అతనూ నన్ను చూశాడు, నను చూడగానే అతని కళ్ళల్లో కనిపించిన మెరుపు నా వయసుకీ, మనసుకీ తెలిసింది.

" నాకు ఆ అమ్మాయి నచ్చింది, నేను తననే చేసుకుంటాను" అంటాడనుకున్న మాటలు అతను అనలేదు.

వైదేహి తనకి బాగా నచ్చిందని తల్లి తండ్రులతో చెప్పాడుట. నా ఊహల్లో, నాకు తెలిసిన కథల్లో జరిగినట్టుగా నిజజీవితంలో జరగలేదు. అది నాకు నచ్చలేదు, నా అందానికీ, చదువుకీ తగిలిన దెబ్బగా నేను భావించాను. అహంభావిని కదా!!

" మా అమ్మాయి ప్రాణ స్నేహితురాలు. ఎంత చక్కనిదో, అంత తెలివైనది. బాగా చదువుతుంది" కల్మషం లేని అత్తయ్యగారి పరిచయం కూడా నాకు సహాయపడలేదంటే అది నాకెంతో అవమానం అనిపించింది.

దానికి తోడు ఆనంద్ అమ్మగారు వెళుతూ అత్తయ్యగారితో " అమ్మాయి లక్షణంగా ఉంది, మా ఎరికలో ఎవరైనా తగ్గవారుంటే చెప్తాను" అనడం నాకు కారం రాసుకున్నట్టయింది.

ఆవిడ కనీసం నాకింకో కొడుకున్నా బావుండును లాంటి మాటలు మాట్లాడకపోవడం నాకు ఎంతో బాధగా అనిపించింది. ఆ బాధలోంచి కోపం,ఉక్రోషంలాంటివెన్నో వచ్చాయి.

దాని ఫలితమే నేను చేసిన పని.. నేను చెప్తున్నది కనీసం నలభై ఏళ్ళక్రితం విషయం.. నాకెంతో ముఖ్యమైన వ్యక్తి, నన్నెంతో ప్రేమించే స్నేహితురాలు వైదేహి గురించి తప్పుగా ఆనంద్ గారికి ఉత్తరం రాశాను.

నమ్ముతావా అమ్మా?, ఆక్షణాన నా వివేకం, నా చదువు, తెలివీ ఏమయిందో ఇప్పటికీ నాకర్థం కాదు. అంత ప్రాణంగా నన్ను చూసుకున్న పిల్ల మీద నింద వెయ్యడానికి, అది ఉత్తర రూపంలో రాయడానికీ నాకు మనసెలా వచ్చిందో? ఆ దుర్మార్గమైన ఆలోచనని ఎలా అమలు పరిచానో తలుచుకుంటే ఇప్పటికీ నామీద నాకు అసహ్యమే.

అప్పుడలా అనిపించలేదు. ఆ దెబ్బతో దాని పెళ్ళి ఆగిపోతుంది, అనుకున్న సమయానికి పెళ్ళి ఆగకూడదని సినిమాల్లో లా వాళ్ళు నన్ను వెతుక్కుని వస్తారులాంటి పిచ్చి ఊహల్లో ఉండేదాన్ని.

కానీ నిజం వేరు, నా ఉత్తరాన్ని మీ నాన్న తేలిగ్గా తీసుకున్నారు. కానీ వైదేహితో చెప్పారు, నమ్మకంతో మొదలుకావల్సిన వైవాహిక జీవితానికి తనవంతుగా అది వైదేహికి చూపించడం తన ధర్మమని చెప్పారుట. దానికి వందల పేజీల నోట్స్ రాసిచ్చిన నా చేతిరాతని అది గుర్తు పట్టడం, గుట్టు విడిపోవడం అన్నీ క్షణాల్లో జరిగిపోయాయి.

ఇంత జరిగాక కూడా వాళ్ళిద్దరూ పెద్దవాళ్ళెవరితోనూ ఒక్క మాట కూడా చెప్పలేదు, గొడవ చెయ్యలేదు. అది వాళ్ళ సంస్కారం.

రేపు పెళ్ళనగా బుగ్గన చుక్కతో, కాళ్ళ పారాణితో నూ నాదగ్గరకొచ్చిన మీ అమ్మ ఒకే మాట అంది తల్లీ!ఒకే మాట!

" ఇందూ, నువ్వు.. నువ్వేనా ఇది?" అని..

దాని చేతిలో నలుగుతున్న ఉత్తరం, కళ్ళవెంట కారుతున్న నీరు, పెళ్ళికూతురవబోతున్న వేళ దాని మనసు పడ్డ క్షోభ..

అప్పటికి కానీ నాకర్థం కాలేదు నేను చేసిన వెధవ పని.. ఆపైన దానికి నా ముఖం చూపించలేదు.. అమ్మతో పంతం పట్టి పిన్ని దగ్గరకి వెళ్ళి బి.యే బియీడీ చదువుకున్నాను. మీ అమ్మ గురించిన వివరాలు అడపా, దడపా తెలుస్తున్నా ఎప్పుడూ కలుసుకునే సాహసం చెయ్యలేదు.

అది నన్ను చూసిన చూపు, ఇందు నువ్వేనా? అన్న మాట ఏళ్ళతరబడి నన్ను తరిమేవి.. నిద్రలోంచి కూడా నిలబెట్టేవి.. ఆనంద్ నమ్మి ఉంటే, కనీసం అనుమానించి ఉంటే దాని పరిస్థితి ఎలా ఉండేది? అన్న ఆలోచన నా మనసుని తినేసేది. అలాంటివేమీ లేవని, ఎంతో సంతోషంగా ఉందనీ, భర్తతో కలిసి అమెరికా వెళ్ళిందనీ తెలిసాక నా మనసు కుదుట పడింది. కానీ దాన్ని కలిసే ధైర్యం మాత్రం రాలేదు.

ఇవన్నీ మీ అంకుల్ తో కూడా దాచలేదు నేను. కలిసి పనిచేసేవాళ్ళం, ఆయన నన్నిష్టపడ్డారని నాకు చెప్పగానే నేను చెప్పినది ఇదే, ఆయనా మీ నాన్నలాగే ఎంతో పెద్దమనసుతో నన్నర్థం చేసుకున్నారు. కొన్నేళ్ళపాటు కౌన్సిలింగ్ చేసేవారు.. ఆపైన నెమ్మదిగా నేను మాములుగా అవగలిగాను. ఎక్కడున్నా వైదేహి సుఖంగా ఉండాలనే ఇన్నాళ్ళూ కోరుకున్నాను.

ఇన్నాళ్ళకి ఇలా అనుకోకుండా కలవడం. పూర్తిగా మీ నాన్న పోలికలతో ఉన్న నిన్ను మొదటిసారి చూడగానే పోల్చుకున్నానమ్మా! ఆపైన రెండునెల్ల క్రితం మీ అమ్మ ని చూశాకా ఇంక ఆపుకోలేకపోయాను. నాగుల చవితి దాని పుట్టినరోజు.. ఇంట్లో నవకాయ పిండివంటలు వండినా సరే మా అమ్మ కలిపే పెరటి చెట్టు దబ్బకాయలంటే ప్రీతి దానికి, ప్రతీ పుట్టినరోజుకీ పెద్ద డబ్బా నిండా చేసి ఇచ్చేది అమ్మా. అలాగే అమ్మ మెడ్రాస్ లో ఉండే పిన్ని దగ్గరనించి నేరుచుకున్న బాసుంది అంటేకూడా.

ఈ రెండు లంచం పెట్టి ఎలాగైనా సరే దాని కాళ్ళ మీద పడి, క్షమార్పణ అడుగుదామ్ననుకున్నాను, దానికీ ధైర్యం రాలేదు. అందుకే ఇలా..

కానీ చూసావా అమ్మా, ఇప్పటికైనా ఒక్క మాటందేమో! అది దాని మనసు, అప్పటికీ, ఇప్పటికీ అదే అందమైన మనసు.. ఆ మనసు ముందూ, ఆ మనిషి ముందు ఎప్పుడూ ఓడిపోవడమే నాకు మిగిలేది.. అప్పుడూ అంతే, ఇప్పుడూ అంతే! అయితే ఈ ఓటమి నాకు గెలుపే.., దాని మనసులో నాకింకా చోటుందని తెలిసిన గెలుపే!!

ఇవన్నీదానికి చెప్పలేకపోయినా నీకు చెప్పగలిగాను.. ఐ యాం టోటల్లీ రిలీవ్డ్ నౌ" అంటున్న ఆవిడ ఏడుపుని ఆపుకునే ప్రయత్నమేదీ చెయ్యడం లేదు..

"ఇందూ" అంటూ లోనికొచ్చిన స్నేహితురాలిని చూసిన తర్వాత అది వరదగోదావరే అయింది.. ఆ ఇద్దరినీ చూస్తూ ఉండిపోయింది వనిత..

COMMENTS